

కమర్షియల్ బ్యాంకులకు దీటుగా డీసీసీబీ సేవలు

కడప అగ్రికల్చర్ : కమర్షియల్ బ్యాంకులకు దీటుగా డీసీసీ బ్యాంకు కూడా అన్ని వర్గాల వారికి తక్కువ వడ్డీతో రుణాలను అందించి వారి అభివృద్ధికి కృషి చేస్తోందని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. శనివారం కడప డీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో డీసీసీ బ్యాంకుకు సంబంధించిన 2023– నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను బ్యాంక్ సీఈఓ రాజేంద్ర కుమార్ అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి, బ్యాంకు చైర్మెన్, డైరెక్టర్, సీఈఓలతోపాటు బ్యాంకు సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియచేశారు. ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహకారంతో నష్టాల బాటలో ఉన్న డీసీసీ బ్యాంకును నేడు లాభాల బాటలోకి తెచ్చామన్నారు. బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి, డీసీసీబీ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

రేపు వైకుంఠ ఏకాదశి

పులివెందుల టౌన్ : సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాలలో ఉత్తర ద్వారం నుంచి భక్తులకు స్వామి దర్శనం కల్పించనున్నారు. పట్టణంలోని శ్రీరంగనాథస్వామి, శ్రీవేంకటరమణుడి ఆలయాలతోపాటు వివిధ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అదేరోజు శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మెన్ సుధీకర్‌రెడ్డి తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి సాయంత్రం స్వామివారు గరుడవాహనంపై పురవీధులలో భక్తులకు దర్శనమివ్వనున్నారని తెలిపారు. కావున భక్తులు స్వామివారిని దర్శించి తరించాలని ఆయన కోరారు.

రేపు ఉత్తర ద్వార దర్శనం

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన శ్రీ మోక్షనారాయణస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకొని సోమవారం ఉత్తర ద్వార దర్శనం నిర్వహిస్తున్నట్లు పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. అలాగే పట్టణంలోని రైల్వే గేటు సమీపంలో వెలసిన శ్రీ రాధాకృష్ణ మందిరంలో సోమవారం ఉత్తర ద్వార దర్శనం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నగదు వితరణ

వేంపల్లె : ఇటీవల బస్సు ఢీకొన్న ప్రమాదంలో శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన నందిని, జ్ఞానేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మానవత సంస్థ ప్రతినిధులు బాధిత కుటుంబానికి శనివారం రూ.57,500ల నగదును అందించినట్లు మానవత సంస్థ అధ్యక్షుడు కావలి కృష్ణతేజ తెలిపారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె మాజీ జెడ్పీటీసీ డాక్టర్ ఎస్.ఎఫ్.బాషా, తదితరలు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ జోష్



పూలంగళ్ల సర్కిల్‌లో పూలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

పులివెందుల టౌన్ : నూతన సంవత్సరంకు యువకులు నూతనోత్సాహంతో 2023కి ఆహ్వానం పలుకుతూ ఆదివారం కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టి నవ భవిష్యత్‌కు బాటలు వేసుకొనేలా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. శనివారం ప్రజలతో పూలంగళ్ల ప్రాంతమంతా కిటకిటలాడింది. కేక్‌ల కోసం బేకరీల వద్ద జనాల రద్దీ కనిపించింది. మహిళలు తమ ఇంటి వద్ద రంగు వల్లులతో ముగ్గులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. చర్చిలు, ఆలయాలు, మసీదులలో ప్రజలు అర్ధరాత్రి ప్రత్యేకంగా ప్రార్థనలు, పూజలలో పాల్గొన్నారు.

నూతన సంవత్సరానికి ఘనస్వాగతం

కమలాపురం : మండల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించు కున్నారు. ముఖ్యంగా శనివారం అర్ధరాత్రి 12 గంటలు కాగానే యువకులు బాణా సంచా పేల్చి నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. కేక్‌లు కట్ చేసి పంచి పెట్టారు. మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సీఐ సత్యబాబు పర్యవేక్షణలో ఎస్ఐ చిన్నపెద్దయ్య సిబ్బందితో కలసి బందోబస్తు నిర్వహించారు.

డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి



వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న వైఎస్ మధురెడ్డి, తదితరులు

చెన్నూరు : గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలు టెక్నాలజీ పరంగా ముందుకు వెళ్లాలని వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని బలసింగాయపల్లె గ్రామ పంచాయతీలోని కనపర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీని ప్రారంభించి మాట్లాడారు. ఉమెన్ సెల్ఫ్ హెల్ప్ గ్రూపు ఫెడరేషన్ బిల్డింగ్ వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీని అధునాతనంగా అన్ని వసతులతో నిర్మించడం జరిగిందన్నారు. గ్రామప్రజలు వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌బాబు, జెడ్పీటీసీ ముదిరెడ్డి దిలీప్‌రెడ్డి, ఎంపీటీసీ పెనుమూరు రఘురామిరెడ్డి, పల్లె కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచులు నారాయణమ్మ, సొంటం నారాయణరెడ్డి, తుంగ చంద్రశేఖర్ యాదవ్, సిద్దిగారి వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఆర్, ఎర్రసాని మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో డిజిటల్ సాంకేతిక విప్లవం

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వజ్ర సంకల్పంతో రాష్ట్ర విద్యా వ్యవస్థలో డిజిటల్ సాంకేతిక విప్లవానికి తెర తీశారని వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను వైఎస్ మధురెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వేముల జెడ్పీటీసీ బయపురెడ్డి, వేముల మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, మున్సిపల్ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నజరుల్లా, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి



కమలాపురంలో ర్యాలీగా వెళ్తున్న అయ్యప్ప భక్తులు

కమలాపురం : అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అయ్యప్పస్వామి ఆలయ గురుస్వామి నరసింహారెడ్డి తెలిపారు. శనివారం అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా గ్రామ చావడి నుంచి పోలీస్ స్టేషన్ వరకు అయ్యప్ప భక్తులు ర్యాలీ నిర్వహించి ఎస్ఐకు వినతిపత్రం అందజేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ అయ్యప్ప పుట్టుకను అవమానిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వేంపల్లె : అయ్యప్ప భక్తులు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బైరి నరేష్ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్‌కే వ్యాలీ ఎస్ఐ రంగరావుకు ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు, అయ్యప్ప భక్తులు వినతిపత్రం అందించారు.

జమ్మలమడుగు : అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నరేష్‌ను కఠినంగా శిక్షించాలంటూ అయ్యప్పస్వాములు శనివారం గురుస్వామి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ జి.శ్రీనివాసులుకు వినతిపత్రం అంజేశారు.

ఎర్రగుంట్ల : అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నరేష్‌ను కఠినంగా శిక్షించాలంటూ పట్టణంలోని హిందువులు నాలుగురోడ్ల కూడలిలో నిరసన వ్యక్తం చేసి అనంతరం సీఐ మంజునాథ్‌రెడ్డికి, తహసీల్దార్ ఎ .నాగేశ్వరరావుకు విశ్వహిందూ పరిషత్ సభ్యులు, అయ్యప్పస్వామి భక్తులు వినతిపత్రం అందజేశారు.

మాత, శిశు మరణాలపై ప్రజలకు అవగాహన



మాట్లాడుతున్న అధికారిణి రమణమ్మ

పులివెందుల రూరల్ : పట్టణంలోని నగరిగుట్ట అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని చిన్నరంగాపురం సచివాలయం, అంగన్‌వాడీ సెంటర్‌లలో శనివారం మాత, శిశు మరణాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డెమో అధికారిణి రమణమ్మ హాజరై గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలకు మాత, శిశు మరణాలు, లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శైలజ, అంగన్‌వాడీ టీచర్ హిమబిందు, వలంటీర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

పులివెందుల టౌన్ : విద్యాభివృద్ధికోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతీసుకుంటున్నారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందులలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కావాలని అడిగిన వెంటనే మంజూరు చేసి ఏడాదిలోనే అందుబాటులోకి తెచ్చారన్నారు. అనంతరం విద్యార్థినులు చేసిన నవరత్నాలు నాటక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ లింగాల ఉషారాణి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, ఎంఈఓ వీరారెడ్డి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, ప్రొఫెసర్ డాక్టర్ బాలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వంద చర్చిలకు కేక్‌ల పంపిణీ

జమ్మలమడుగు : నూతన సంవత్సరం సందర్భంగా నియోజకవర్గంలోని వంద చర్చిలకు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి వంద కేక్‌లను శనివారం ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మార్బల్ శ్రీను ఆధ్వర్యంలో పంపిణీ చేయించారు. నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని, నేడు తాను అందుబాటులో ఉండటంలేదని ఎవ్వరూ రావద్దని ఎమ్మెల్యే తెలిపారు.

సీఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని.. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్‌లు అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఇంటికీ కొళాయి, యూజీడీ తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. 2023 నుంచి పెంచిన రూ.2750ల పింఛన్ ఇవ్వడం జరుగుతుందని.. ప్రతి కౌన్సిలర్ తమ వార్డు పరిధిలో పింఛన్ పంపిణీ కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు. అనంతరం కౌన్సిల్ ఆమోదంకోసం ఉంచిన పలు అభివృద్ధి పనులను కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వేగంగా గృహనిర్మాణ పనులు

చెన్నూరు : కనపర్తి జగనన్న లే అవుట్‌లో చేపట్టబోయే గృహ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం ఆయన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కనపర్తి జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 730 గృహాలకు గాను 450 గృహాలు బేస్‌మట్టం వరకు పూర్తి కావచ్చాయని మిగతావి కూడా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లకు అప్పగించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటసుబ్బయ్య, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, తహసీల్దార్ పఠాన్ అలీఖాన్, ఎంపీడీఓ సురేష్‌బాబు, హౌసింగ్ ఏఈ మేనిల్, జెడ్పీటీసీ ముదిరెడ్డి దిలీప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఆర్, ఎంపీటీసీలు పెనుమూరు రఘురాంరెడ్డి, ఎర్రసాని నిరంజన్‌రెడ్డి, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



కమలాపురం : నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2023వ సంవత్సరం నియోజకవర్గ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023లో మరిన్ని సేవలు అందించి ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటారని ఆయన తెలిపారు.

ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- 6న కమలాపురంలో జాబ్‌మేళా
- పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం కడప నగరంలోని ఎమ్మెల్యే స్వగృహంలో జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను ఆయన అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే ఈ జాబ్‌మేళాను ఏపీ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ, సీ డ్యాప్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్సైంజ్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. కమలాపురంలో జరగనున్న ఈ జాబ్‌మేళాకు కియా మోటార్స్ ఇండియా, షిర్డిసాయి ఎలక్ట్రికల్స్, మెడ్ ప్లస్, అపోలో ఫార్మసీ, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, హ్యూన్ డై మొబీస్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా అభ్యర్థులు ఇంటర్వ్యూకు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మా రాజేంద్రనాథ్‌రెడ్డి, పులి సునీల్‌కుమార్, డీఆర్‌డీఏకు చెందిన పృథ్వీతేజ్ తదితరులు పాల్గొన్నారు.

177 కొత్త పింఛన్లు మంజూరు

వీరపునాయునిపల్లె : మండలంలోని 15 సచివాలయాల పరిధిలో 177 పింఛన్లు మంజూరైనట్లు మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. పింఛన్ల వివరాలను మండల అబివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలియజేశారు. అలిధెన 6, అనిమెల 12, గంగిరెడ్డిపల్లె 19, ఇందుకూరు10, కొమ్మద్ది 9, మొయిళ్లచెరువు 8, ఎన్.పాలగిరి 9, పాయసంపల్లె 29, ఎస్ పాలగిరి 23, యు.రాజుపాలెం 16, ఉరుటూరు1–8, ఉరుటూరు 2–5, వీరపునాయునిపల్లె 12, వెల్దుర్తి 11 పింఛన్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. వీరికి నేడు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నూతనంగా ఎంపికై 13 మంది వలంటీర్లకు నియామక పత్రాలు అందజేశారు.

124 నూతన పెన్షన్లు..

వల్లూరు : మండలానికి 124 నూతన పెన్షన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 9 గ్రామ సచివాలయాలు వుండగా దిగువపల్లెకు 8, దుగ్గాయపల్లెకు 13, కొప్పోలుకు 5, లేబాకకు 6, పైడికాలువకు 19, తోల్ల గంగనపల్లెకు 16, తప్పెట్లకు 15, కోట్లూరుకు 10, వల్లూరుకు 32 నూతన పెన్షన్‌లు మంజూరైనట్లు ఆమె తెలిపారు. జనవరి మొదటి వారంలో వారికి పెన్షన్‌తో పాటు పత్రాలను అందజేస్తామన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

ముద్దనూరు : మండలంలోని కోడిగాండ్లపల్లె గ్రామానికి చెందిన రాయపాటి గంగమ్మ(65) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఏఎస్‌ఐ ఆంజనేయులు కథనం మేరకు.. డిసెంబరు 26వ తేదీన కోడిగాండ్లపల్లెలో గంగమ్మ మందుల కోసం 104 వాహనం వద్దకు వెళ్తుండగా దేవర దున్నపోతు ఆమెను పొడవడంతో తీవ్రగాయాలపాలైంది. ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నలుగురు అరెస్టు

చెన్నూరు : స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం రాత్రి కోడి పందేలు ఆడుతున్న సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ దాడిలో రెండు కోళ్లతోపాటు రూ.5100 నగదును స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు.